www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
బుధవారం । 27 । మే । 2026





# సాగు నీరందించడమే లక్ష్యం

**ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి**

**రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, భీమా, నెట్టెంపాడు, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా చేపట్టి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో త్రాగు, సాగునీటి లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నర్లాపూర్ వద్ద కొనసాగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-3 పనులు, వనపర్తి జిల్లా పరిధిలోని

మిగతా 2లో..



# పట్టుదల ఉంటే అన్నింటా రాణింపు

- దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట
- దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య
- పట్టుదలతో ముందుకు సాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరు
- టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి

సంగారెడ్డి, అక్షిత బ్యూరో:
దివ్యాంగుల సంక్షేమం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్య క్రమంలో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయ ప్రకాశ్ రెడ్డి,తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలు దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మందికి స్కూటీలు, 15 మంది లబ్ధిదారులకు బ్యాటరీ వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాం గుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దన్నారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు

మిగతా 2లో..



# ప్రభుత్వ భూమి కబ్జా

## ప్లాట్లుగా అమ్మకం

**కమలాపురంలో కబ్జా**

**ప్రభుత్వ భూమిలో కమర్షియల్ ప్లాట్లు**

**ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ దర్జాగా అమ్మకాలు**

**రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలి**

**మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజ డిమాండ్**

ములుగు, అక్షిత బ్యూరో :

ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం గ్రామం ఆర్ఎంసి స్కూలు ఎదురుగా ప్రభుత్వ భూమి సర్వే 116 లో 6-00 ఎకరాల ప్రభుత్వ భూమి గిరిజనేతరుల కబ్జాలో ఉన్నది ఇట్టి భూమిని కమర్షియల్ ప్లాట్లు చేసి లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారు.

మిగతా 2లో..

# రూ.30 లకలు కుదుర్చుకొని

# రూ.2 లక్షలు తీసుకుంటూ

- ఏసీబీకి చిక్కిన తహసిల్దార్ సుచరిత
- శామీర్‌పేట్ తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల దాడులు
- తహసిల్దార్‌తో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

శామీర్‌పేట్, అక్షిత ప్రతినిధి:

ఎకరాకు లక్ష చొప్పున 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు రూ.30 లక్షలకు కుదుర్చుకొని రూ.2 లక్షల లంచం తీసుకుంటూ తహసీల్దార్ సుచరిత ఏసీబీ అధికారులకు చిక్కింది. శామీర్ పేట్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన



మీడియా సమావేశంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వివరాలు వెల్లడించారు. శామీర్ పేట్ మండలం ఆలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు

మిగతా 2లో..

# ప్రతి బూత్ ఏజెంట్ ఓ సైనికుడు..



2లో..

# ప్రభుత్వ భూమి కబ్జా-ప్లాట్లుగా అమ్మకం

(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్లాట్‌లలో మట్టి పోస్తు పోల్స్ వేస్తున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకొవాలని మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మండల కమిటీ డిమాండ్ చేస్తుంది. మంగపేట మండలంలోని 25 గ్రామపంచాయతీలలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అక్రమ పట్టాల పేరుతో రిజిస్ట్రేషన్ల పేరుతో ఇంటి నిర్మాణాలు చేసిన వారు, చేస్తున్న వారిపై గిరిజన ప్రాంతంలో గిరిజన చట్టాల ప్రకారం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో గిరిజన చట్టాలు 1ఆఫ్59, 1ఆఫ్70 , పెసా, ఎల్టిఆర్ చట్టాలను ప్రతిష్టంగా అమలు చేయాలని మన్యసిమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు, మన్య సీమ జిల్లా నాయకులు తోలేం సుధాకర్, ఆక తిరుమల్ రావు, గొప్ప చంద్రకాంత్, పెద్దల రాంబాబు, తదితరులు రెవెన్యూ అధికారులను కోరారు.





# ప్రతి బూత్ ఏజెంట్ ఓ సైనికుడు..

- ఎస్ఐఆర్ “పై బూత్ స్థాయి నేతలు దృష్టి సారించాలి
- బూత్ ఏజెంట్ అవగాహన సదస్సులో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,డీసీసీ ప్రెసిడెంట్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**కాజీపేట్, అక్షిత ప్రతినిధి:**

హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి బూత్ ఏజెంట్ పార్టీకి సైనికుడిలా పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు, ఓటర్ల వివరాలు, ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. “ఎస్ఐఆర్” (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్) ప్రక్రియపై ప్రత్యేకంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పూర్తి స్థాయి పట్టణ వాతావరణంలో ఉండటంతో ఓటర్లను గుర్తించడం, వారి వివరాలను నిరంతరం అప్‌డేట్ చేయడం చాలా క్లిష్టమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రజలు తరచూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారడం, అద్దె ఇళ్లలో నివసించడం, ఉద్యోగాల కారణంగా చిరునామాలు మారడం వల్ల ఓటరు జాబితాలో ఖచ్చితత్వం నిలుపుకోవడం సవాల్‌గా మారుతుందని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో “ఎస్ఐఆర్ “ప్రక్రియ మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. గతంలో 2002లో జరిగిన “ఎస్ఐఆర్” ప్రక్రియ మళ్లీ 2026లో నిర్వహించబడుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, బూత్ ఏజెంట్లు దీనిని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరును మ్యాపింగ్ చేసుకోవడం, కుటుంబాల వారీగా వివరాలు నమోదు చేయడం, కొత్త ఓటర్ల గుర్తింపు, మారిన ఓటర్ల వివరాల సవరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే భారీ నష్టం జరిగే అవకాశముందని ఎమ్మెల్యే, ఎంపీ హెచ్చరించారు. సరైన మ్యాపింగ్ లేకపోతే అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తప్పిపోవడం, డూప్లికేట్ నమోదులు పెరగడం, పోలింగ్ రోజు గందరగోళ పరిస్థితులు తలెత్తడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. బూత్ స్థాయిలో ఒక్క చిన్న పొరపాటు కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నారు. అనంతర ఎంపీ కడియం కావ్య ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ ఏజెంట్ సంక్షిప్త సమాచార హ్యాండ్ బుక్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,డివిజన్ అధ్యక్షులు, నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగు నీరందించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఏదుల రిజర్వాయర్ పంప్ హౌస్ నిర్మాణ పనులు, నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని వట్టెం శ్రీ వెంకటేశ్వర రిజర్వాయర్ మరియు పంప్ హౌస్ పనులను మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పర్యటనలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ కూచుకళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ప్రాజెక్టు ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అనంతరం సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ పనులు, భూ సేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల అభివృద్ధి, పంప్ హౌస్‌ల నిర్మాణ పురోగతి తదితర అంశాలను అధికారులు మంత్రికి వివరించారు.

అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడుతూ..... నాగర్ కర్నూల్ వనపర్తి జిల్లాల్లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టులలో ఒకటని తెలిపారు.

మహాత్మా గాంధీ కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, జూరాల ప్రాజెక్టుల స్థాయిలను విస్తరింపజేసి నాగర్ కర్నూల్ గద్వాల వనపర్తి అచ్చంపేట కల్వకుర్తి నియోజకవర్గాల రైతులకు నీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టుల సందర్శన చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

గత పది సంవత్సరాల కాలంలో పాలమూరు రంగారెడ్డి పూర్తి చేస్తామని 80 వేల కోట్లు వెచ్చించి పూర్తి చేసి నీరందిస్తామని మాటలకు పరిమితమైన దని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల ప్రాజెక్టుల నిర్మాణాల స్థితిగతులపై త్వరలోనే సందర్శనకు రానున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం సారథ్యంలోనే ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ప్రాజెక్టుల వద్ద పనులను పరిశీలించి అవసరమైన సలహాలను భూ సేకరణకు అడ్డంకుల్లేకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని అందుకు అవసరమైన ప్రణాళికలతో సిద్ధం చేసి పనుల పూర్తి చేసేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టులు పూర్తయితే దశాబ్దాలుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న పాలమూరు ప్రాంత రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీర్చబడతాయని తెలిపారు. ప్రాజెక్టు పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేసిన మంత్రి, నిర్ణీత గడువుల్లో పనులను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించామని మంత్రి తెలిపారు.

ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మెగా రెడ్డి పాల్గొన్నారు.



# రూ.30 లక్షలు కుదుర్చుకొని రూ.2 లక్షలు తీసుకుంటూ


(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ సుచరిత తన డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని చెప్పారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామన్నారు. తహసిల్దార్ సుచరితతో పాటు కీసర ఆర్డీఓ రాజేష్, పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

# పట్టుదల ఉంటే అన్నింటా రాణింపు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన సహాయ ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల దివ్యాంగులు కూడా ప్రభుత్వ సేవలు సులభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టుదల, మనోధైర్యం ఉంటే



జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారని కొనియాడారు. లక్ష్య సాధనకు కృషి, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని చెప్పారు. దివ్యాంగులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను స్టాఫ్ నర్స్‌గా పనిచేసిన రోజుల్లో లెప్రసీ వార్డులో సేవలు అందించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, చేసే పనిలో సేవాభావం, నిబద్ధత ఉంటేనే నిజమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం జిల్లా సంక్షేమ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. వారికి అత్యుత్తమ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు, షఫీ, నర్సింలు, రాయకోటి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.





## బక్రీద్ సందర్భంగా చెత్త వ్యర్థాలను తొలగించాలని వినతి

**వనపర్తి అక్షిత ప్రతినిధి:** వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీలో బక్రీద్ పండుగ సందర్భంగా ఆయా కాలనిలో చెత్త వ్యర్థాలను తొలగించాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు డబ్బా సలీం, ఏజాజ్ ఆలి, ఫిరోజ్ కలిసి మున్సిపల్ కమిషనర్ సైదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మే 28, 29, 30 తేదీలలో బక్రీద్ పండుగ సందర్భంగా కుర్బాని చేసుకుంటారు ముఖ్యంగా 1వ వార్డు, 2వ వార్డు, 6వ వార్డు (శివ గార్డెన్ బ్యాక్ సైడ్, మదీనా మసీద్ ఏరియా), 8వ వార్డు, 9వ వార్డు, 10వ వార్డు, 11వ వార్డు, 12వ వార్డు, 13వ వార్డు ఒ 15వ వార్డులలో అధిక సంఖ్యలో ముస్లిం మైనారిటీలు ఉన్నందున ఈ ప్రాంతాల్లో చెత్త ఎక్కువగా పేరుకుపోయి తీవ్రమైన వాసన వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెత్త బండ్లను రెండు పూటలు తిప్పకపోవడం వలన ప్రజలు చెత్తను ఇంటి సందుల్లోనో, చెత్తకుండీల్లోనో వేయవలసి వస్తుందని తెలిపారు. దీని వల్ల వర్షపు నీటితో కలిసి తీవ్రమైన వాసన, వ్యాధులు ఇతర హాని కలగవచ్చని తెలిపారు. కాబట్టి ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా ఈ మూడు రోజులు ఉదయం సాయంత్రం పైన తెలిపిన వార్డులలో ప్రత్యేక శ్రద్ధతో చెత్త బండ్లను తిప్పి చెత్తను త్వరగా తొలగించాలని, అన్ని మసీదుల దగ్గర రోడ్లు శుభ్రం చేయించి శానిటైజేషన్ కొట్టించాలని కోరారు. అలాగే పండగ మూడు రోజులపాటు మున్సిపాలిటీ వాటర్ కొరత లేకుండా చూడాలని అదేవిధంగా ఈద్గా దగ్గర గేటు ముందల ఉన్న మురికి కాలువలో చెత్త పేరుకుపోవడం వలన మురికి నీళ్లు ఈద్గా లోపలికి వస్తున్నాయి అందుకు కాలువ క్లీన్ చేయాల్సిందిగా కోరారు.

## పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

**ముస్తాబాద్‌లో తాడుతో**

**ఆటోను లాగుతు కాంగ్రెస్ శ్రేణుల వినూత్న నిరసన**

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** దేశ వ్యాప్తంగా సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను పెంచుతూ భారాన్ని మోపుతోందని రాష్ట్రంలో బిజెపి మొసలి కన్నీరు కారుస్తూ రైతు గోస బిజెపి భరోసా అనే కార్యక్రమాన్ని చేపట్టిందని ఇది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే అని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ముస్తాబాద్ మండల కేంద్రంలో అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కేంద్రం పెట్రోల్ డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆటో కు తాళ్లను కట్టి లాగి నిరసన తెలిపి మాట్లాడారు. దేశంలో రోజు రోజుకు పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగాయంటే రానున్న రోజుల్లో నిత్యావసర



సరుకుల ధరలు కూడా పెరగడం ఖాయమని అన్నారు. ఇరాన్ అమెరికా యుద్ధాన్ని బూచిగా చూపుతూ పొదుపు పాటించాలని సూచిస్తూనే వారి అనుయాయులకు అంబానీ అధానీలకు దోచిపెట్టే విధంగా వారి ప్రవర్తన ఉందన్నారు.

రాష్ట్రంలో బిజెపి రైతు గోస బీజేపీ భరోసా అని చేపట్టిన కార్యక్రమం నోటితో వెక్కిరిస్తూ నోసలుతో నవ్విన చందంగా ఉందని అన్నారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెగుదల వల్ల రైతుల నడ్డి విరుగు తుందా లేదా అనేది బిజెపి శ్రేణులు చెప్పాలన్నారు. రాష్ట్రంలో రైతుల కష్టాలకు కారణం బిజెపినే అని ఈ సందర్భంగా ఆయన అన్నారు.





# మంత్రివర్యా మీ ఆదేశాలకు ఫలితమేశా..?

- **పేరుకే మార్కెట్ కమిటీ చైర్మన్.. రైతుల కష్టాలు పట్టని పాలకులు!**
- **రోడ్డెక్కిన రైతన్నలు: స్తంభించిన కాటారం - మంథని ప్రధాన రహదారి**

**అక్షిత బ్యూరో, జయశంకర్ భూపాలపల్లి:**

ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాతకు ఎటు చూసినా ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. ఒకవైపు వాతావరణ మార్పులు, మరోవైపు సకాలంలో జరగని ధాన్యం కొనుగోళ్లతో రైతాంగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో సుమారు 10 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన మార్కెట్ కమిటీ కార్యాలయం, గోదాములు ఉన్నప్పటికీ రైతాంగానికి దక్కిన ఫలితం శూన్యంగా మారింది. అటు అధికార పార్టీ నాయకులకు గానీ, ఇటు అధికారులకు గానీ రైతుల పట్ల ఎలాంటి నిబద్ధత లేదని అన్నదాతలు మండిపడుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న విపరీతమైన జాప్యానికి నిరసనగా రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట రోడ్డుపై ధాన్యం బస్తాలు వేసి ధర్నాకు దిగారు. దీంతో కాటారం – మంథని ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది.

### కొనుగోలు కేంద్రాల్లో 50 రోజులుగా నిరీక్షణ

తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి 50 రోజులు గడుస్తున్నా, కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగకపో వడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీల కొరత కారణంగా ధాన్యం కుప్పలు కేంద్రాల వద్దే పేరుకు పోయాయని, అకాల వర్షాలకు తడిసి, పశువుల పాలవుతున్నాయని ఆవేదన చెందారు. కొన్ని చోట్ల ధాన్యం మొలకెత్తే పరిస్థితి వచ్చినా, అధికారులు మాత్రం కార్యాలయాలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. కొనుగోలు కేంద్రాల్లో కనీసం తార్పాలిన్లు (కవర్లు) కూడా ఏర్పాటు చేయకుండా రైతుల పంటను నిర్లక్ష్యానికి బలి చేస్తున్నారని ఆరోపించారు.

"సరిపడా లారీలు లేని వ్యక్తికి రవాణా టెండర్లు ఎలా ఇచ్చారు? అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ధాన్యం తరలింపును గాలికొదిలేశారు" అని రైతులు తీవ్రంగా ఆరోపించారు.

### మంత్రి స్వగ్రామం వద్దే ఈ దుస్థితా?

స్థానిక మంత్రి పక్క గ్రామంలోనే రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతుంటే, రాష్ట్రంలో రైతు పాలన ఎక్కడ ఉందని నిలదీశారు. మంత్రి స్వగ్రామానికి కూతవేటు దూరంలోనే రైతులు ధాన్యానికి కావలి కాస్తూ, రాత్రింబవళ్లు అవస్థలు పడుతున్నా పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. "పంట పండిస్తే కొనరు.. కొనుగోలు కేంద్రాలకు తెస్తే పట్టించుకోరు.. అసలు రైతు హితం ప్రభుత్వానికి ఉందా లేదా?" అంటూ అన్నదాతలు నిప్పులు చెరిగారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమకు పురుగుల మందే దిక్కవుతుందని రైతులు హెచ్చరించారు.

### ముంచుకొస్తున్న నైరుతి.. పట్టని కలెక్టర్!

మరికొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రానుండటంతో రైతాంగం భయాందోళనల్లో మునిగిపోయింది. జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడంతోనే, చివరకు చేసేదేమీ లేక రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని రైతులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే లారీలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


# జన గణన ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్.**

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు జనాభా గణన ఎంతో కీలకమైందని నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. నగరంలో కొనసాగుతున్న తొలి దశ జనాభా గణన ప్రక్రియలో భాగంగా మంగళవారం రోజు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ పలు డివిజన్లలో పర్యటించారు. నగరంలోని రాంనగర్, మంకమ్మతోట తదితర ప్రాంతాల్లో పలు హౌజ్ లిస్ట్ బ్లాక్ లను స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. గణనలో చేపడుతున్న విధానం, నెంబరింగ్, వివరాల సేకరణ, నమోదు తదితర విషయాల పై ఎన్యూమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జన గణన ప్రక్రియ వేగవంతం పై ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ జన గణన లో ప్రతి ఇంటినీ సర్వే చేయాలన్నారు. హౌజ్ నంబరింగ్, నివాస గృహాల వివరాల సేకరణ అత్యంత కీలకమని తెలిపారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల పరిధిలో ప్రతి ఇంటినీ సందర్శించి, ఖచ్చితమైన వివరాలను సేకరించాలన్నారు. సర్వేను సూపర్ వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. నగర వ్యాప్తంగా దాదాపు 166231 నివాస గృహాలు



సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు దాదాపు హౌజ్ లిస్ట్ బ్లాక్ వారిగా మొత్తం 98064 నివాస గృహాలు పూర్తైనట్లు తెలిపారు. జన గణన ప్రక్రియను మరింత వేగవంతం చేశామని ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్ ప్రకారం ప్రజల జీవన స్థితిగతులు, గృహా వసతుల సమాచారం తదితర ఖచ్చితమైన వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే స్వీయ గణన చేసుకున్న వారు యూనికోడ్ ఐడీ నెంబర్ వివరాలను మీ వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు అందించాలని పిలుపు నిచ్చారు. నగర ప్రజలు జన గణన ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహాకరించి ఖచ్చితమైన వివరాలను అందిస్తే ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని దీనికి నగర ప్రజలు సహాకరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు గణాంకాలే ప్రాతిపదిక అని తెలిపారు. ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు ఇంచార్జ్ అధికారులు సమన్వయంతో పని చేసి జన గణన ను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలన్నారు. క్షేత్ర స్తాయిలో ఏమైన సమస్యలు వస్తే సూపర్ వైజర్లు పరిశీలించి తక్షణమే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జన గణన ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టి పారదర్శకంగా పకడ్బందీగా జన గణన ను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంచార్జ్ అధికారి వేణు, ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.






# నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసుల ఉక్కుపాదం

- **అక్రమ ఫైనాన్స్,వడ్డీ దందాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఏకకాలంలో ఆకస్మిక దాడులు.**
- **అధిక వడ్డీలతో ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు.**
- **అనుమతులు లేకుండా ఫైనాన్స్,వడ్డీ వ్యాపారం చేస్తే కేసులు నమోదు.**
- **06 కేసులు నమోదు, రూ.1,39,65,000/- విలువ గల వివిధ డాక్యుమెంట్లు, 1,77,000, విలువ గల బంగారు,వెండి ఆభరణాలు స్వాధీనం.**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై మంగళవారం ఉదయం పోలీసులు 15 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో







ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై 06 కేసులు నమోదు చేసి రూ.1,39,65,000/- విలువ గల వివిధ డాక్యుమెంట్లు, 1,77,000 విలువ గల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించడం, అధిక వడ్డీలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమకున్న అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవసరాల కోసం అధిక మొత్తంలో అవసరాలకు మించి అధిక వడ్డీలకు అప్పు చేసి ఆ తరువాత అప్పులు,అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దని ఎస్పీ కోరారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్దతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలని ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయిన అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వొచ్చు అని, అలాగే స్థానిక పోలీసు వారికి పిర్యాదు చేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.అధిక వడ్డీ రేట్లతో సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# మా ప్రాంతంలో ఉపాధి కావాలి...

**పర్యావరణానికి ముప్పు కలిగించే “ఎకో టౌన్” మాకొద్దు**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కలిసిన ఎమ్మెల్యే**

**తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకూడదంటూ ఎమ్మెల్యే స్పష్టికరణ**

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:**

ఇండస్ట్రియల్ పార్కు కోసమని పేదలు భూములు ఇచ్చారు.. ఇక్కడ ఉపాధి దొరుకుతుందని భావించారు.. తీరా పర్యావరణంతో పాటు ప్రజల జీవితాలను నాశనం చేసే ఏకో టౌన్ పేరిట డంపింగ్ యార్డ్ మాకొద్దని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ “వీర్లపల్లి శంకర్” జిహెచ్ఎంసి కమిషనర్ తో అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ ను ఏర్పాటు చేయవద్దని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ను కలిశారు. స్థానిక నాయకుడు తాంద్ర కాశీనాథ్ రెడ్డితో కలిసి కమిషనర్ నుకలుసుకున్నారు. ఎకో టౌన్ ప్రతిపాదనకు పూర్తిగా వ్యతిరేకం, మా ప్రజలు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పడితే ఇక్కడి ప్రజలకు ఉపాధి దొరుకుతుందని భూములు ఇచ్చారు కానీ ఎకో టౌన్ లాంటి ప్రతిపాదన తెచ్చి మా ప్రాంతాలలో పర్యావరణ సమస్యలను కొని తెచ్చుకోవడానికి సిద్ధంగా లేమని ఎమ్మెల్యే కమిషనర్ కు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ.. ఎకో టోన్ ఏర్పాటు కోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 4 చోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఏకో టౌన్ లో కేవలం చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి (వేస్ట్ టు ఎనర్జీ) అనేది మున్సిపల్ ఘన





వ్యర్థాలను (మురికి చెత్త) ఇంధనంగా మార్చి విద్యుత్తును తయారు చేస్తారు. అలాగే రీసైక్లింగ్ ప్రక్రియ చేస్తారు అని తెలిపారు. సిద్దాపూర్ లో ఏకో టౌన్ ప్రతిపాదన వద్దని ఎమ్మెల్యే కోరుతున్నందున ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ప్రజలకు అనుకూలంగా నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు..

## మహేశ్వరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిహెచ్ యాదయ్య దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజక వర్గము కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య దంపతులకు 37వ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ. పెళ్లి అనే బంధంతో ఒక్కటై ఒకరినొకరు అర్థం చేసుకుంటూ కలకాలం హాయిగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూమరో వసంతం పూర్తి చేసుకున్న మీ అపురూప జంట మరెన్నో ఇలాంటి పెళ్లి రోజులు జరుపు కోవాలని మనసారా కోరుకుంటూ ప్రేమానురాగాలతో ఒక్కటైన మీ అనురాగ జంటకి పెళ్లిరోజు శుభాకాంక్షలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య దంపతులకు సీనియర్ జర్నలిస్ట్ చిక్కిరి శ్రీకాంత్ తరపున ప్రత్యేకంగా పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరుగుతుంది.



## భగవద్గీత పోటీల్లో కోదాడకు చెందిన గుండా కల్పనకు స్వర్ణ పతకం... అభినందనీయం

**మాతృదేవోభవ చారిటబుల్ సొసైటీ కార్యదర్శి ఓరుగంటి రమాదేవి**

**కోదాడ, అక్షిత ప్రతినిధి:**

కోదాడ పట్టణానికి చెందిన గుండా కల్పన మైసూర్ లోని ఎస్.జి.ఎస్ దత్తపీఠం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో సంచలన విజయం సాధించి, బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ కఠినమైన పరీక్షలో... భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలకు సంబంధించిన 700 శ్లోకాలను గుండా కల్పన అద్భుతంగా ఉచ్చరిస్తూ పూర్తి అవగాహనతో అడిగిన వెంటనే చెప్పి ఉత్తీర్ణత సాధించారు. ఈ ప్రతిభకు గుర్తింపుగా



మైసూర్ దత్తపీఠంలో జరిగిన వేడుకలో పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి హస్తాల మీదుగా ఆమె బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో, గోల్డ్ మెడల్ సాధించి కోదాడకు తిరిగి వచ్చిన గుండా కల్పనను మంగళవారం స్థానిక “గీతామృతం” కోదాడ బృందం సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. భగవద్గీత లాంటి మహోత్కృష్ట గ్రంథంపై పట్టు సాధించి కోదాడ పేరును నిలిపిన కల్పన అందరికీ స్ఫూర్తిదాయకమని ప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి రమాదేవి, యాదరాణి, తోడుపునూరి మంజుల, వంకాయ స్వాతి, గాదంశెట్టి సుజాని, చారుగండ్ల ప్రవీణ, రణబోతు చైతన్య, రాధిక కుమ్మరి కుంట్ల , వెంపటి నాగలక్ష్మి, మిట్టపల్లి హైమావతి , కాజా హరిత రజిత, మీనా కుమారి, తదితరులు పాల్గొన్నారు






# మహిళల ఆర్థిక ప్రగతికే మున్సిపాలిటీ ప్రాధాన్యత

**-మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్.**

**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల మున్సిపాలిటీ మెప్మా విభాగం ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగముగా ఏర్పాటు చేసిన పట్టణ మహిళా సమావేశం స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని చైర్పర్సన్ పిలుపునిచ్చారు. ఈ




సందర్భంగా సంఘాల బలోపేతం, లీడర్ల మార్పిడి, ఇందిరా మహిళా శక్తి ప్రగతి ఆడిట్ నివేదికలపై చర్చించారు. ఐదు సూత్రాలు పాటిస్తున్న ఉత్తమ సంఘాలను సన్మానించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటా తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందిస్తూ స్వచ్ఛ జగిత్యాలగా మార్చాలని కోరారు. చదువు రాని మహిళలకు ఉల్లాస్ ప్రోగ్రామ్ ద్వారా అక్షరాస్యత నేర్పి, పరీక్షలు రాయించడం పట్టణానికే గర్వకారణమని అభినందించారు.

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణం, మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చే 'ఇందిరా మహిళా శక్తి' పథకాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని చైర్పర్సన్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దయాల చంద్రకళ శంకర్, బొల్లరపు స్వప్న గిరిధర్, అరవ లక్ష్మీ, సుంకేటి మమత రామకృష్ణ రెడ్డి, బడుగు పద్మ రాజేందర్, గట్టపల్లి మానస జ్ఞానేశ్వర్, సిరిపురం శ్రీలత శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, కోరుకంటి రాము, కూతురు శేఖర్, కమాలుద్దిన్, రాజియోద్దీన్, అయూబ్ ఖాన్, సాయికిరణ్, డియంసి సునీత, టీయంసీ రజిత, సి. ఓ లు, మెప్మా సిబ్బంది, ఆర్.పి లు, పట్టణ సమాఖ్య ప్రతినిధులు మరియు మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "ఎద్దు వధ - మాంసం అక్రమ రవాణా... జిల్లాలో కలకలం"

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:**

ఆసిఫాబాద్ జిల్లా ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడ గ్రామ సమీపంలో రైతు కుడికాలు సత్తయ్యకు చెందిన ఎద్దును గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళలో అతి కిరాతకంగా వధ చేసి మాంసాన్ని తరలించినట్టు స్థానికులు ఆరోపించారు. జిల్లా పోలీస్



యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ, ఈ ఘటన చోటు చేసుకోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

అక్రమ మాంస రవాణా కేసు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.గ్రామస్థులు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పోలీసులు వెంటనే నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# నగరంలో ఆక్రమణల తొలగింపు..

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ నగరంలోని హెడ్ పోస్టాఫీస్ కూడలి నుంచి సీకేఎం ప్రసూతి ఆసుపత్రి వరకు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన పూల దుకాణాలను బల్దియా సిబ్బంది తొలగించారు. రోడ్డు ఆక్రమణల కారణంగా ఆసుపత్రికి వెళ్లే అంబులెన్సులు, గర్భిణీలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గతంలో "నేటిధాత్రి" పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆలస్యంగా అయినా స్పందించి చర్యలు చేపట్టిన బల్దియా అధికారులను పలువురు అభినందిస్తున్నారు.

అయితే ఇదే తరహాలో పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిపై కూడా ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రోడ్డుపై బండ్లు పార్కింగ్ చేయడం, మండిబజార్ పరిసరాల్లో కొన్ని హోటళ్ల ముందు రహదారినే ఆక్రమించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక్కడ కూడా అధికారులు కఠిన చర్యలు ఉండాలని అంటున్నారు.




# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల రెడ్డి**




**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:**

మహిళా సంక్షేమం, ఆర్థిక సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఇప్పటివరకు రూ.2 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలను పూర్తిస్థాయిలో అందిస్తున్నట్లు చెప్పారు. పట్టణ పరిధిలో 212 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో అర్హతలేని వారికి కేటాయింపులు చేసిందని ఆరోపించారు. అప్పట్లో అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరా శక్తి పథకం కింద 119 మందికి రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు రెండు రంగుల్లో చీరలను పంపిణీ చేస్తోందని, పట్టణంలో సుమారు 29 వేల మంది మహిళలకు ఈ చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టీఎంసీ విజయభారతి, కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రాజెక్టులపై సీఎం పర్యటన అంత డ్రామా

**- కప్పటి పాండురంగారెడ్డి**



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కపటి పాండు రంగారెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి పాలమూరు జిల్లాను కరువు రహిత జిల్లాగా మారుస్తామంటూ కాలయాపన చేస్తూ, ప్రాజెక్టుల పేరుతో రాజకీయ లబ్ధి పొందుతున్న ఇటు గత బీఆర్ఎస్, అటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిపై రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ నెల 30, 31 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టబోయే పాలమూరు ప్రాజెక్టుల సందర్శన కేవలం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తప్ప, జిల్లాపై ఉన్న ప్రేమతో కాదని స్పష్టమవుతోంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉండి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రీ-డిజైనింగ్ పేరుతో తొక్కిపెట్టింది మహా వంచన చేసింది. కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాలను పెంచారే తప్ప, క్షేత్రస్థాయిలో పనులను పూర్తి చేయలేదు. ( ఆర్డీఎస్ ) వంటి కీలక ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని నిలువునా ముంచారు. కమీషన్ల కక్కుర్తి పడి కరవు జిల్లాకు తీవ్ర అన్యాయం చేసారు. పాలమూరు గుండె నిండా నీళ్లు నింపుతామని చెప్పి, పదేళ్ల పాటు ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని వలసల జిల్లాగానే మిగిల్చింది గత ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా గానీ, కేంద్రం నుండి పర్యావరణ, అటవీ అనుమతులు గానీ సాధించడంలో పూర్తిగా విఫలమైంది. గోర నిర్లక్ష్యం చేసింది. ప్రాజెక్టులకు బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించలేదు. భూసేకరణ పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం ఊసే లేదు.

ప్రాజెక్టుల సమగ్ర నివేదికల (డీపీర్) రూపకల్పనలో,సాంకేతికలోపాలను సవరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, శ్రీహరి, ఇప్పటివరకు కేవలం కాగితాల మీద, ఏసీ రూముల్లో సమీక్షలు నిర్వహించారే తప్ప, క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

అధికారంలోకి వస్తే శరవేగంగా పనులు పూర్తి చేస్తామని నిరుద్యోగులను, రైతులను నమ్మించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలను ముందు పంపి హడావుడి చేయడం హాస్యాస్పదం. ఇప్పటికైనా ఈ రాజకీయ డ్రామాలను పక్కనబెట్టి... తక్షణమే పాలమూరు ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి, భూసేకరణ పూర్తి చేయాలి, పెండింగ్ అనుమతులను సాధించాలి. లేనిపక్షంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు, రైతాంగం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయం అని పాండురంగా రెడ్డి హెచ్చరించారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY





# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే వరకు ఉద్యమం

**పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపం**

**మహబూబ్ నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ నేత పురుషోత్తం రెడ్డి కాంగ్రెస్ నాయకుడు రఘునాయక్**

**షాద్ నగర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ధర్నా**

**ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించిన కాంగ్రెస్ శ్రేణులు**

**పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ కన్నెర్ర**

**ఆందోళనకు తరలివచ్చిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు**

షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: పెంచిన పెట్రోల్, డీజిల్‌ధరలు తగ్గించేవరకు కాంగ్రెస్ పార్టీ ఉద్యమం కొనసాగిస్తుందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ను నిరసిస్తూ మంగళవారం షాద్ నగర్ నియోజక వర్గ కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఫరూక్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ తదితరుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలపై ఆర్డిఓ కార్యాలయం ముందు నినాదాలతో ఆందోళన చేశారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘునాయక్, మండల పార్టీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి రమేష్, జాకారం చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, జందాగూడెం సుదర్శన్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, మహిళా విభాగం నాయకురాళ్ళు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డిఓ సరితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి. రఘునాయక్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజల సంక్షేమాన్ని ఏనాడు పట్టించు కోలేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో ఎఫ్‌సీఐ పూర్తిగా విఫలమైందని, మొక్క జొన్నకు మద్దతు ధర ప్రకటించి కేంద్రం చేతులు దులుపుకుందని విమర్శిం చారు. బంగారం కొనద్దని, పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలని పేర్కొంటున్న మోదీ మాత్రం లక్షల రూపాయల సూట్ వేసుకొని దేశాలు తిరుగుతున్నాడని ఆరోపించారు. యువజన కాంగ్రెస్ నాయకుడు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మత రాజకీయాలతో పబ్బం గడుపుతుందని విమర్శించారు. భవిష్యత్తులో బిజెపి నాయకులను ప్రజలు అడ్డుకుంటారని కాంగ్రెస్ పార్టీ కూడా గ్రామాల్లో తిరగనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి బిజెపి ప్రభుత్వం వేడుక చూస్తుందని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మార్కెట్లో పనికిమాలిన రాజకీయాలు బిజెపి చేస్తుందని గతంలో నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతుల నడ్డి విరిచిన బిజెపి నాయకులు సిగ్గుపడాలని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ అబద్ధపు హామీలతో కాల యాపన చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచబోమని మాట్లాడిన ప్రధాని నరేంద్రమోదీ మాట తప్పారన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల వరకు దేశప్రజలను నమ్మించిన మోదీ, ఎన్నికలు పూర్తవగానే ధరలు పెంచేశారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం 28లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిందని, నీట్‌పరీక్ష రద్దు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. కేంద్రం ప్రజలపై భారం మోపడం దారుణం అన్నారు. ఈ ఆందోళనలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, అన్నాగల్ల రమేష్ , జాకరాం చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోనీ శ్రీధర్, జాండ గూడెం సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు, చల్లా శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఇబ్రహీం, ఖాదర్ ఘోరీ సర్పంచుల చించెడ్ శ్రీనివాస్ , ఆర్ బాబు నాయక్, ,కొమ్ము కృష్ణ, అయ్యవారి పల్లి గోపాల్ రెడ్డి, మంకల శ్రీశైలం, నర్సింహులు, తేజ్య నాయక్, కౌన్సిలర్ల బచ్చలి నరేష్, మురళి మోహన్ , కొప్పునూర్ ప్రవీణ్, సోలిపూర్ అనిల్, నేతలు తుపాకుల శేఖర్, జాంగారి రవి, లింగారెడ్డి గూడ అశోక్, ఖదీర్, గిరిజన నేత శ్రీను నాయక్, బుద్ద నర్సింహులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్ణ కర్ , నర్సింహులు, సురేష్ గౌడ్, సోలీపూర్ శ్రీశైలం గౌడ్, జాంగారి జంగయ్య, చిన్న, ముభరక్ అలీ, కర్రోల్ల సురేందర్, దాఖం మనీష్, బాల గంగాధర్, చించెడ్ అనంతం, హైదర్ ఘోరీ, మల్లేష్ గౌడ్, మల్లారెడ్డి, నిరటి వాసు, సుమన్ నాయక్, భాస్కర్ నాయక్, మార్గం రాజేష్ , రోమియో రమేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సింగాపగ అనిల్ కుమార్ , మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు, భాస్కర్, గణేష్ నాయక్, రాజు నాయక్, కావాలి నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



# బక్రీద్‌కు అన్ని సౌకర్యాలు కల్పించండి

**ఇస్నాపూర్ కో-ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ నిజాముద్దీన్ బాబా**

పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి: బక్రీద్ పండుగ సందర్భంగా ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని ఈద్గాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఇస్నాపూర్ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ నిజాముద్దీన్ బాబా మేనేజర్ మధుసూదన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఈద్గాల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని కోరారు. తాగునీరు, టెంట్లు వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నమాజ్ చేయడానికి ముందు కాళ్ళు, చేతులు కడుక్కోవడానికి (వుజూ చేసుకోవడానికి) వీలుగా నీటి ట్యాంకర్లు, తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈద్గాలలో పిచ్చి మొక్కలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు సహకరించాలని కోరారు. భక్తులు కూర్చోవడానికి, నమాజ్ చేసుకోవడానికి వీలుగా మైదానమంతా కార్పెట్లు పరుస్తామన్నారు. నమాజ్ సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరాను ఉంచేలా అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఈద్గాల వైపు వచ్చే దారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రార్థనలకు వచ్చేవారి వాహనాల పార్కింగ్ కు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. బక్రీద్ ఏర్పాట్ల కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని, ప్రార్థనలు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పహాడీ షరీఫ్ 64 డివిజన్‌లో హెల్త్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డ్‌ల పంపిణీ

**పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి**

మహేశ్వరం, అక్షిత ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా, ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం పహాడీ షరీఫ్ 64 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో హెల్త్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డ్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం



నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం భారంగా మారకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తోందని అన్నారు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్, భూపాల్ రెడ్డి, ఫాజిల్ ఖాద్రీ, భాను, వసీం, రజనీకాంత్ గౌడ్, నిసార్ హసన్, ఒమర్, హబీబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద పాల్గొన్నారు.




# బాల్య వివాహాల రహిత తెలంగాణ

**- జిల్లా కలెక్టర్ డా.సత్య శారద**

వరంగల్, అక్షిత బ్యూరో: మహిళా వారోత్సవాలలో భాగంగా "బాల్య వివాహ రహిత తెలంగాణ" కార్యక్రమం పర్వతగిరి ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ డా,సత్య శారద హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయలక్ష్మి, డీడబ్ల్యువో రాజమణి, డిసిపిఓ ఉమా, ఎంపీడీఓ శంకర్ నాయక్, ఎమ్మార్వో వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# లిఫ్టులో ఇరుక్కున్న డిఆర్డిఏ కార్యాలయ ఉద్యోగి

### విధులకు హాజరయ్యే క్రమంలో కలెక్టరేట్‌లో ఘటన



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయల సము దాయంలోని లిఫ్టులో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డీఆర్డీఏ కార్యాల యంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏపీడి)గా విధులు నిర్వర్తిస్తున్న నర్సింగ్ అనే ఉద్యోగి ఇరుక్కున్నారు. విధులకు హాజరయ్యేందుకు మంగళవారం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన పై అంతస్తులో ఉన్న తమ శాఖ కార్యాలయా నికి వెళ్లడానికి లిఫ్ట్ ఎక్కారు. ఈ క్రమంలో సాంకేతిక కారణాలతో లిఫ్ట్ మధ్యలోనే ఆగిపోయింది. శ్వాస ఆడడం లేదంటూ తోటి ఉద్యోగులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సుమారు గంటన్నర తర్వాత సాంకేతిక నిపుణులు లిఫ్ట్ నుంచి ఆయనను బయటకు తీసుకొచ్చారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

### - డిసిపిఓ బూర్ల మహేష్

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** ప్రజా పాలన ప్రత్యేక ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన నేడు “బాల్య వివాహ ముక్త భారత్” కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ మండలం కౌటగూడ గ్రామపంచా యతీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి బాల సంరక్షణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి బాలల రక్షణ, సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) బూర్ల మహేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు జరపాలని చట్టం స్పష్టంగా పేర్కొంటోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు.

పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు, వేధింపుల నేపథ్యంలో ప్రతి తల్లిదండ్రి అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ




ఇతరుల వద్ద ఒంటరిగా వదిలివేయరాదని హెచ్చరించారు. చిన్నారుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తకాలు, కథలు చదివే అలవాటు చేయాలని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పరిమితం చేయాలని సూచించారు.

అనంతరం గ్రామస్థాయి బాల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సభ్యులకు బాధ్యతలు, విధులను వివరించారు. గ్రామంలో పిల్లలకు రక్షణ, సంరక్షణ, విద్య, ఆరోగ్యం తదితర అంశాల్లో సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పిల్లలపై హింస వంటి సమస్యల నివారణలో గ్రామస్థాయి కమిటీలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లైలా, పంచాయతీ కార్యదర్శి శ్వేత, కౌన్సిలర్ చంద్రశేఖర్, గ్రామంలోని యుక్తవయసు బాలికలు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పశువుల అక్రమ రవాణా జరగకుండా నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ శ డి.జానకి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అడ్డాకల్ టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, మరియు జిల్లా ఎస్పీ డి.జానకి సంయుక్తంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు, రెవెన్యూ మరియు పశుసంవర్ధక శాఖ అధికారులకు పశువుల రవాణాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పశువుల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా చట్టాన్ని గౌరవిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

# డంప్‌యార్డ్ ఏర్పాటుకు ససేమిరా ఒప్పుకోం..!

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టీకరణ

### షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సిద్ధపూర్ తదితర ప్రాంతాల రైతులు

### ఎమ్మెల్యేను కలుసుకుని గోడు వెళ్ళబోసుకున్న ప్రజలు



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** డంప్ యార్డ్ ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లో సిద్ధాపూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని దీనికి తాను ససే మీరా ఒప్పుకునే పరిస్థితి లేదని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారంలో భాగంగా ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. కొత్తూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎస్ బి పల్లి అంబటి ప్రభాకర్, సురేష్, ఆగిర్ రవికుమార్ గుప్తా ఇంకా తదితర నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను కలిసి డంపింగ్ యార్డ్ వ్యవహారాన్ని ఆయన ముందు ప్రస్తావించారు. ఇదివరకే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తదితర సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎమ్మెల్యే శంకర్ వారికి వివరించారు. తప్పకుండా ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కొంత సమయమును పాటించి ఆలోచించాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రసక్తి ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం వద్ద ప్రజలు నినాదాలు చేశారు..

# బాల్యవివాహాలను నిర్మూలించాలి

### - గుంజపడుగులో అవగాహన కార్యక్రమం

**పెద్దపల్లి అక్షిత ప్రతినిధి:** బాల్య వివాహాలను నిర్మూలించాలని ఇందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని గుంజపడుగు గ్రామ సర్పంచ్ దండేవేనా సంధ్య భానేష్ కోరారు. మంగళవారం మంథని మండలం గుంజపడుగు గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా బాల్యవివాహాలపై అవగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండిన అబ్బాయిలకు వివాహాలు చేయాలనే చట్ట నిబంధనను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని చిన్న వయసులోనే వివాహాలు చేయడం వలన తల్లి శిశువుకు ఆరోగ్యం ప్రమాదకర మన్నారు. అలాగే కుటుంబ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఈ మేరకు గుంజపడుగు గ్రామంలో అందరి సహాయ సహకారాలతో బాల్యవివాహాలను అడ్డుకోవాలని సర్పంచ్ గ్రామ ప్రజలను కోరారు. పిల్లలను చదివించాలని చట్టాలను గౌరవించాలని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా



జిల్లా మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ అరుణ, ఉప సర్పంచ్ ఎలుక లక్ష్మీ సదానంద, వార్డు సభ్యులు భోగే రాజేశ్వరి, దేవళ్ళ లక్ష్మీ, దొడ్డిపట్ల శంకర్, బోగే సంపత్తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ భవనం ప్రారంభం

### చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : కలెక్టర్, ఎమ్మెల్యే



**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల రెండవ రోజు సందర్భంగా సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.8 లక్షలు, సీడీపీఓ ఆధ్వర్యంలోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మించారు.

ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త అంగన్వాడీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి డి డబ్ల్యూఓ రాజమణి ఖిలా వరంగల్ తాసిల్దార్ ఇక్బాల్ ఎంపీడీవో రమేష్ గుంటూరుపల్లి సర్పంచ్ సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# లాపరోస్కోపిక్ అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు

### క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి శస్త్రచికిత్స చేస్తే ప్రమాదాలు తగ్గించవచ్చు

### డాక్టర్ జి.దయాకర్ రావు సూచన

**వనపర్తి అక్షిత ప్రతినిధి:**

అపెండిక్యులర్ మాస్, కోలస్ క్యాన్సర్ వంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని మలక్ పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జి. దయాకర్ రావు చెప్పారు. అత్యాధునిక లాపరోస్కోపిక్, అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన వివరించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్ వై ఎస్ బంకెట్ హాల్లో క్యాన్సర్ పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. దయాకర్ రావు మాట్లాడుతూ అపెండి క్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ కు అరుదైన చికిత్స యశోద ఆసుపత్రిలో విజయవంతంగా జరిగిందని చెప్పారు. వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల సూగురు యాదమ్మ తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డతో యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరిందని, పరీక్షల్లో అపెండిక్యులర్

మాస్తో పాటు కోలస్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ టి. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోగికి లాపరోస్కోపిక్ ఎక్స్ప్లోరేషన్, అడ్హీజి యోలిసిన్, ఒమెంటల్ బయాప్సీ నిర్వహించారని తెలిపారు. అనంతరం డాక్టర్ దయాకర్ రావు పర్యవేక్షణలో రైట్ హెమి కోలెక్టమీ, ఐలీయో ట్రాన్స్వర్స్ అనాస్థమోషన్ శస్త్ర చికిత్స విజయ వంతంగా నిర్వహించారని తెలిపారు. పెద్దప్రేగు భాగంలో గడ్డతోపాటు చుట్టుపక్కల భాగాలకు అంటుకుపోయిన ఇన్ఫ్లమేటరీ మార్పులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు.

శస్త్ర చికిత్స అనంతరం రోగికి యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ చికిత్స, డయాబెటిస్ నియంత్రణ, ప్రత్యేక పర్యవేక్షణ అందించారన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడి స్థిరపడడంతో అవసరమైన సూచనలతో డిశ్చార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు. అపెండిక్స్ లేదా పెద్ద ప్రేగుకు సంబంధించిన క్యాన్సర్ తో కూడిన అపెండిక్యూలర్ మాస్ అనేది క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధి అని, కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ, జీర్ణ సమస్యల వంటి లక్షణాలతో ఇది కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమయానికి గుర్తించకపోతే ఇన్ఫెక్షన్ వ్యాప్తి, ప్రేగు అవరోధం, క్యాన్సర్ ముదిరే




ప్రమాదం ఉంటుందని, ముందస్తు నిర్ధారణ, అత్యధునిక పరీక్షలు, సకాలంలో శస్త్ర చికిత్స అత్యంత కీలకమని చెప్పారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ను ప్రారంభ దశలో గుర్తించడం, అత్యాధునిక లాపరో స్కోపిక్ పరీక్షలు, బయాప్సీ కి ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ చేయవచ్చున్నారు. క్లిష్టమైన కోలస్ క్యాన్సర్ కు విజయవంతమైన శస్త్ర చికిత్స నిర్వహణ, జీర్ణాశయ క్యాన్సర్కు మల్టీడిసిప్లినరీ వైద్య విధానానికి ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షలు అవసరమని అన్నారు. అత్యాధునిక గ్యాస్ట్రోఇంటెస్టినల్, సర్జికల్ ఆంకాలజీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఈ కేసు మలక్పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక గ్యాస్ట్రో ఇంటిస్టీనల్ సర్జరీ, సర్జికల్ అంకిలజీ సేవలు, సమగ్ర వైద్య సదుపాయాలను మరోసారి ప్రతిభంబించిందని అన్నారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ వంటి క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే ఖచ్చితంగా నిర్ధారించి అత్యాదునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ శస్త్ర చికిత్సల ద్వారా విజయవంతంగా చికిత్స అందించడం ఆసుపత్రి నైపుణ్యాన్ని చాటిచెప్పిందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందం, మల్టీ డిసిప్లినరీ వైద్య విధానాలతో క్లిష్టమైన క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత వ్యాధులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించగల సామర్థ్యం తమ ఆసుపత్రికి ఉందని ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కే.శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర లు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో సురక్షితమైన, నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలను అందించడంలో తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డీజీఎం లక్ష్మణా శ్రీకాంత్, ఏ.వాసు కిరణ్ రెడ్డి ఉన్నారు.

# కొత్తకోటలో ఘనంగా శ్రీ కాత్యాయని దేవి వ్రతం

**వనపర్తి అక్షిత ప్రతినిధి:** ఆర్య వైశ్య జిల్లా మహిళా సంఘం, వనపర్తి అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి బంగారయ్య ఆధ్వర్యంలో మంగళవారం కొత్తకోటలోని శ్రీ శ్రీ శ్రీ వాసవిమాత దేవాలయం లో శ్రీ కాత్యాయని దేవి వ్రతం ఆధ్యాత్మిక వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పట్టణ ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఎలిశెట్టి జయలక్ష్మి నాగరాజు, ప్రధాన కార్యదర్శి



చేపర్తి మంజుల విజయకుమార్, కోశాధికారి కల్వ నీరజ నరహరి పాల్గొన్నారు. అలాగే ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు భీమ చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి బుశెట్టి శ్రీనివాసులు, కోశాధికారి అర్థం శ్రీనివాసులు హాజరయ్యారు. వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో ఆర్య వైశ్య మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమం విజయ వంతంగా ముగియడంతో నిర్వాహకులను భక్తులు అభినందించారు.



# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ బాపూరావు

### నివాళులర్పించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

### అంత్యక్రియలు నిమిత్తం తక్షణ సహాయం కింద 30 వేల రూపాయలు అందజేత

### భాగోద్వేగానికి లోనయ్యి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎస్పి

**అసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం, బంబారా గ్రామానికి చెందిన జాడి బాపూరావు ( రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధుల నిర్వహణ, 1993 పోలీస్ బ్యాచ్)సోమవారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. మంగళవారం బాపురావు గారి స్వగ్రామమైన బాంబారాలో వారి భౌతిక కాయానికి జిల్లా ఎస్పీ నితికా పంత్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భావోద్వేగానికి లోనయ్యారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద రూపాయిలు 30,000 వారి కుటుంబ సభ్యులకు అందించి, ధైర్యంగా ఉండాలని భరోసనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయ శంకర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు వేణుగోపాల్, శ్రీనివాస్, వామన మూర్తి, సంజయ్, సబ్ ఇన్స్పెక్టర్స్ వెంకటకృష్ణ, మహేందర్, పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# గణితశాస్త్రంలో కస్ప శ్రీలతకు పీహెచ్.డీ.

**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కస్ప శ్రీలత డాక్టరేట్‌కు అర్హత సాధించారు.

'నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాలు అయస్కాంత-ద్రవగతి ప్రవాహ విశ్లేషణ' చేసి, ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి షేరి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ డాక్టరల్ పరిశోధన, శక్తి వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ శీతలీకరణ, పర్యావరణ నమూనా వంటి అధునాతన సాంకేతిక అనువర్తనాలలో ఉష్ణ, ద్రవ్యరాశి బదిలీ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెట్టినట్టు తెలియజేశారు.



ఈ అధ్యయనం, నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాలతో కూడిన సంక్లిష్ట నాన్-లీనియర్ ప్రవాహ వ్యవస్థలను విశ్లేషించడానికి గాలెర్కిన్ ఫైనైట్ ఎలిమెంట్ పద్ధతిని, మ్యాట్ లాబ్-ఆధారిత సిమ్యులేషన్లను ఉపయోగించిందన్నారు. ఈ పరిశోధన ఫలితాలు ఉష్ణ-ద్రవ వ్యవస్థలు, గతిశాస్త్ర పరిశోధనల పురోగతికి గణనీయంగా దోహదపడతాయని వివరించారు.డాక్టర్ శ్రీలత సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.